ఈనాడు
వికారాబాద్
గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు

రెండు పడకల

ఇళ్లకు శ్రీకారం


గృహాల నిర్మాణానికి యంత్రంతో పనులు

- కేసీఆర్ నగర్‌లో పనులు ప్రారంభం
- ఐదు బ్లాకుల్లో ౬౦౦ గృహాలు

న్యూస్‌టుడే, తాండూరు

తాండూరులో ముఖ్యమంత్రి కేసీఆర్ నగర్ పేరిట ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండుపడక గదుల ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది డిసెంబరు చివరి నాటికి లబ్ధిదారులకు వీటిని అప్పగించనున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 1000 రెండు పడక గదుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది, ఇందులో తాండూరు పట్టణంలోనే 600 గృహాల నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని ఏడెకరాల ప్రభుత్వ స్థలంలో మంత్రి మహేందర్‌రెడ్డి జూన్ 17న శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.36.30 కోట్ల వ్యయంతో జి+2 పద్ధతిన ఐదు బ్లాకుల్లో నిర్మాణం చేపట్టేందుకు నమూనాను రూపొందించారు. హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారు టెండర్ పొందారు. జేసీబీతో గుంతలు తవ్వుతున్నారు. ఒక్కో ఇంటిలో హాల్, వంట గది, రెండుపడక గదులు, శౌచాలయాలు ఉంటాయి. ఇవి కాకుండా మెరుగైన విద్యుత్తు సరఫరా, తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల వంటి **మిగతా 7 లో...**

నిఘా కన్ను.. వైద్యానికి దన్ను!



ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. వైద్య సిబ్బందిలో జవాబుదారీ తనం పెరగనుంది. విధి నిర్వహణలో బాధ్యతలను సక్రమంగా నిర్వహించనున్నారు. చోరీలు ఇతర ఉదంతాలు చోటుచేసుకుంటే తక్షణమే చర్యలు చేపట్టేందుకు వీలుంటుంది. ఇందుకోసం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రాంతీయ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.


తాండూరు జిల్లా ఆస్పత్రిలో వైద్యంకోసం వచ్చిన ప్రజలు

న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ

- ఆస్పత్రుల్లో మెరుగుపడనున్న సేవలు
- పెరగనున్న పర్యవేక్షణ

జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఏడు కేంద్రాల్లో రాత్రి పగలు ఇరవైనాలుగు గంటలపాటు వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. మిగిలిన పదమూడు కేంద్రాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యం అందిస్తున్నారు. వీటిల్లో పదిహేను మంది వైద్యులు, ఇరవైమంది స్టాఫ్‌నర్సులు విధులను నిర్వహిస్తున్నారు. ఆస్పత్రులకు అనుసంధానంలో మరో 153మంది ఏఎన్ఎంలు జిల్లాలోని 367 పంచాయతీల్లో వైద్యసేవల్లో కొనసాగుతున్నారు. వీరి విధులను పర్యవేక్షించేందుకు నలభైమందికిపైగా పర్యవేక్షకులు విధులు నిర్వహిస్తున్నారు. వికారాబాద్, పరిగి, కొడంగల్ పట్టణాల్లో ప్రాంతీయ ఆస్పత్రులను నిర్వహిస్తుండగా పదులసంఖ్యలో వైద్యసిబ్బంది విధుల్లో కొనసాగుతున్నారు. వీటిలో నిత్యం వందలసంఖ్యలో ప్రజలు వైద్యసేవలు పొందుతున్నారు. ఈ సేవలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈమధ్యే జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటింపజేసేందుకు బయోమెట్రిక్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఉదయం, సాయంత్రం విధిగా సిబ్బంది హాజరు వేయాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది గైర్హాజరు, సమయపాలన పాటించేలా చేయగలిగారు. తాజాగా మరో అడుగు ముందుకేసి అన్ని ఆస్పత్రుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని మంత్రి కేటీఆర్ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రకటించారు.

జిల్లా పాలనాధికారి కార్యాలయానికి అనుసంధానం...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను జిల్లా పాలనాధికారి కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. దీంతో పాలనాధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఆస్పత్రుల్లో వైద్యసేవలను నిరంతరాయంగా పర్యవేక్షించనున్నారు. సిబ్బంది పనితీరు, హాజరు, సమయపాలనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మార్పు తెచ్చేందుకు కృషి చేయనున్నారు. నిఘా కెమెరాల వల్ల అన్ని ఆధారాలు పొందే వీలుండడంతో **మిగతా 7 లో...**


తెగులు సోకిన పంటను పరిశీలిస్తున్న అధికారి

తెల్ల బంగారానికి'..

తెగుళ్ల దెబ్బ!

వికారాబాద్:

జిల్లాలో పత్తి పంటను అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ పంటకు పింక్ బోల్వాంగ్ పురుగు ఆశించింది. విత్తనం వేసిన నాటి నుంచి తిరిగి పంట చేతికందేవరకు అన్నదాతకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ వైపు నుంచి నకిలీ విత్తనాలు, పురుగు మందులు అంటగట్టి, నల్లబజారులో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారు. మరో వైపు వరుణుడు దోబూచులాడుతున్నాడు. ఈ రెంటిని అధిగమించి 'సాగు'దామన్నా.. సరైన సమయంలో పైరుకు తెగులు సోకి పంటను నాశనం చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పత్తి పంటలో గులాబీ రంగు కాయతొలిచే పురుగు దాడి చేస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, గద్వాల్ జిల్లాల్లో పింక్ బోల్వాంగ్ ప్రభావం ఎక్కువగా ఉందని గుర్తించారు. అప్రమత్తమైన రాష్ట్ర స్థాయి అధికారులు వెంటనే అన్ని జిల్లాల వ్యవసాయ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తెగులు గుర్తించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచనలు...

- పింక్‌బోల్వాంగ్‌తో పొంచి ఉన్న ప్రమాదం
- జిల్లాపై తీవ్ర ప్రభావం
- లింగాకర్షక బుట్టలతో నివారణ

జిల్లాలో సుమారు 1.7లక్షల హెక్టార్లలో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, కంది పంటలు ఉన్నాయి. అత్యధికంగా సుమారు 46 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి పండిస్తున్నారు. ప్రస్తుతం పంట పూత దశకు చేరుకుంది. ఈ సమయంలో (పంట 45 రోజుల నుంచి) గులాబీ రంగు కాయతొలిచే పురుగుదాడి చేస్తోంది. దీన్ని గుర్తించకుంటే పంటను సర్వనాశనం చేస్తుంది. ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడులు వృథా అవుతాయి. అందుకని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గులాబీ రంగు కాయతొలిచే పురుగు ఉందా.. లేదా అనేది తెలుసుకోవడానికి **మిగతా 7 లో...**

జలం తగ్గుముఖం.. సేద్యం భారం!

దోమ, న్యూస్‌టుడే: నిరుడు వర్షాకాలంలో పడిన వర్షాలతో పరిగి డివిజన్‌లోని తిమ్మాయపల్లి చెరువు నిండింది. వర్షాకాలంలో ఆయకట్టు సాగు చేశారు. యాసంగిలో చెరువులో నీళ్లు నిల్వ ఉంచడంతో జలం పెరిగి గొట్టపు బావుల కింద పంటల సాగు చేసుకునేందుకు వీలు కల్గింది. కర్షక కార్మికులు తమ కుటుంబాలను హాయిగా పోషించారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించారు. కానీ ఈ ఏడాది బలమైన వర్షం పడక చెరువులోకి నీరు చేరలేదు. పాత నీరే కొద్దిగా ఉంది. ఈ ఒక్క చెరువు మాత్రమే ఇలా ఉందని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. దాదాపుగా ఎక్కడా కూడా చెరువుల్లోకి వరద పాటు వచ్చేంతటి భారీ వర్షాలు పడలేదు. దీంతో నియోజక వర్గ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నీళ్లులేని ఐనాపూర్ బెండ్రోని కుంట

ఉత్తుత్తి మురిపెం..

ఈ ఏడాది వర్షాకాలం ఆరంభం కావడానికి కొద్ది రోజుల ముందు మురిపించిన వరుణుడితో గొట్టపు బావుల్లో నీటి మట్టం కాస్త పెరిగింది. దీంతో చాలా మంది రైతులు వరిసాగుకు సిద్ధం అయ్యారు. తరువాత ముఖం చాటేయడంతో గొట్టపు బావుల్లోనీటి మట్టిం తగ్గింది. వరిసాగుకు నీరందని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరిలో వాన కురిసింది. రైతన్న మురిశారు. తీరా రోజులు గడిచేకొద్దీ ప్రస్తుతం దోబూచులాడుతుంది. దీంతో మొలకెత్తి మెట్టపైర్లు ఎండు ముఖం పట్టాయి. కానీ రెండు పసల్లు (ఖరీఫ్, యాసంగి) పంటలు పండాలంటే ముఖ్యంగా నీరు అవసరం. నీరు కావాలంటే వర్షాలు బాగా పడాలి. అప్పుడు కానీ నీటి వనరులు (చెరువులు, కుంటలు) నిండవు. పంటలకు సాగునీరు, తాగునీరు అందదు.



పశువులకూ సరిపోని నీటితో సూదరమ్మ చెరవు

★ పరిగి డివిజన్‌లో లఖ్నాపూర్ ప్రాజెక్టు మినహా పెద్దగా చెప్పుకోదగిన నీటి వనరులు లేవు. అయినా గ్రామీణ ప్రాంతాల్లో 100 నుంచి 600 ఆయకట్టుకు సాగు నీటిని అందించే సామర్థ్యం కలిగిన సమారు 500వరకు చిన్నా పెద్దా చెరువులున్నాయి. కానీ వర్షం లేక ఎక్కడా కూడ ఒక్క చెరువూ నిండలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు భారీ వర్షాలు పడితే చాలా చెరువులు నిండేవి. భూగర్భజలం పెరిగేది. గొట్టపు బావుల్లో నీటి మట్టం పెరిగి రైతులకు మేలు కల్గుతుండేది. కానీ నిండని చెరువులతో రైతులు మెట్టపంటల పైనే ఆధార పడ్డారు. ఈ పాటికి కొద్దోగొప్పో చెరువుల్లోకి నీరు చేరిఉంటే ఆయకట్టు కింది పొలాల్లో వరి సాగు చేసుకునేందుకు అవకాశం దొరికేదని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు లేక అదను దాటింది. ఇప్పటికిప్పుడు వర్షం పడి చెరువు నిండినా ఖరీఫ్ అదను దాటింది. అయినా యాసంగికి మేలు కల్గుతుంది. తాగునీటికి ఇక్కట్లు తప్పుతాయని రైతులు పేర్కొంటున్నారు.

మరమ్మతులు చేసినా ఫలితంలేదు

ప్రభుత్వం నీటి వనరులకు పూర్వ వైభవం తీసుకు వచ్చి రైతన్నకు సాగు నీటిని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లు వెచ్చించి మిషన్ కాకతీయ కింద నీటి వనరులను (చెరువుల) మరమ్మతులు చేస్తున్నారు. వీటి ఫలాలు అందించేందకు ప్రభుత్వం చేస్తున్న కృషి బాగానే ఉంది. కానీ వానలులేక మరమ్మతులు చేసినా నీటివనరులు ఓటి కుండల్లా దర్శనమిస్తున్నాయి సాగుచేసిన వరినారుమడులకు సాగునీరు కూడా అందని పరిస్థితి నెలకొందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలపై ఆగని అడవి జంతువుల దాడులు!



అడవిపందులు ధ్వంసం చేసిన కందిపంట

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: అడవి పందుల బెడదతో పరిగి, తాండూరు, వికారాబాద్, కొండంగల్ నియోజకవర్గాల్లోని రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ముఖ్యంగా కొడంగల్, తాండూరు ప్రాంతాల పరిధిలో కరవుతో అల్లాడుతున్న తరుణంలో వర్షాధార పంటలుగా సాగుచేసిన కంది, జొన్న, పత్తి పంటలను అడవి పందులు తీవ్రంగా నష్టం పరుస్తున్నాయి. పత్తి కాయ దశలో ఉండగా, జొన్న కంకులు పోసిందని, కంది మధ్యస్థ దశలో ఉందని ఈ సమయంలో పందుల దాడితో ఏంచేయాలో పాలుపోవడంలేదని రైతులు వాపోతున్నారు. అడవి పందులు పంటలను తవ్వి, పొర్లాడడంతో ఎదుగుతున్న పంట తీవ్రంగా దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పంటలను సాగుచేసినా ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువుల దాడులతో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నామని వారు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో కళ్లల్లో ఒత్తులు వేసుకుని కాపలా కాస్తున్నా ఎక్కడో ఓచోట పంటను నాశనం చేస్తున్నాయన్నారు. వీటితో పాటు కొండముచ్చులు సైతం పత్తిపంటలలో గుంపులుగా చేరి కాయలను తినేస్తున్నాయన్నారు. కొండంగల్, బొంరాస్‌పేట, మద్దూరు, తాండూరు తదితర ప్రాంతాల్లో పొలాల దగ్గర ఒంటరిగా మహిళలు, చిన్నారులు ఉంటే వారిపై దాడికి దిగుతున్నాయన్నారు. ఇప్పటికే వర్షాలు లేక పెట్టుబడులు పెట్టి అప్పుల పాలయ్యామని ప్రస్తుతం అడవి జంతులతో విపరీతమైన నష్టం వాటిల్లుతుందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అడవిజంతువుల బారి నుండి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అడవిపందులు పొర్లాడడంతో పాడైన జొన్నపంట

ప్రధానోపాధ్యాయుడి గదిలో మద్యం సీసాలు

☛ కంగుతిన్న ఎమ్మెల్యే సంజీవరావు
☛ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

మర్పల్లి, న్యూస్‌టుడే: గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేయడానికి వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రధానోపాధ్యాయుడి గదిలో మద్యం సీసాలు దొరికాయి. ఈ సంఘటన మర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు... స్థానిక ఎమ్మెల్యే సంజీవరావుకు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదవే విద్యార్థులకు గత కొన్ని రోజులుగా మేనూ ప్రకారం భోజనం అందడం లేదని, అక్కడ విద్యార్థులకు ఉన్న సమస్యల్ని అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో తొలుత కస్తూర్బా పాఠశాల విద్యార్థుల వసతి గృహానికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లారు. అక్కడ విద్యార్థులతో సమస్యలపై మాట్లాడుతున్నారు... సరిగ్గా అదే సయంలో ఎమ్మెల్యే వెంట ఉన్న జిల్లా గ్రంథాలయం ఛైర్మన్ కొండల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడి గదిలోని బల్లలో దస్త్రాలను చూస్తున్నారు. అక్కడ నల్లటి పాలీథీన్ కవర్ కన్పించింది. దాన్ని బయటకు తీయడంతో అందులో తాగి వదిలేసిన మద్యం సీసాలు, గ్లాసు కనిపించాయి. దీంతో అందరు ఒక్కసారిగా అవాక్కయ్యారు. పాఠశాలలు దేవాలయంతో సమానం.. అలాంటి చోట మద్యం తాగి సీసాల్ని పడేస్తారా? అని ఎమ్మెల్యే అక్కడి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో గైర్హాజరైన ఇన్‌ఛార్జీ వసతి గృహ సంక్షేమాధికారి మల్లేశంపైనా చిందులు తొక్కారు వెంటనే జిల్లా గిరిజన సంక్షేమాధికారి సత్యనారాయణతో చరవాణిలో మాట్లాడారు. బంట్వారం బీసీ వసతి గృహ సంక్షేమాధికారిగా ఉన్న మల్లేశంను ఇన్‌ఛార్జీ గిరిజన సంక్షేమాధికారిగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. వసతి గృహంలో ఇష్టారాజ్యంగా వ్యవరిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన అహారం అందివ్వకుండా తప్పుడు లెక్కలు చూపించి అన్యాయం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారిగా తక్షణం పరిశీలించి వసతిగృహ సంక్షేమాధికారిని తొలగించి వేరే వారిని నియమించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లేదా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్నారు. అనంతరం విద్యార్థులు ఎలా చదువుతున్నారు? అనే విషయాల్ని ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయం ఛైర్మన్ కొండల్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు సుమిత్రమ్మ, జడ్పీటీసీ శోభారాణి, తెరాస నాయకులు ఉన్నారు.




పాఠశాలలో లభించిన మద్యం సీసాలు, గదిలో దుర్వాసన రావడంతో ముక్కుమూసుకున్న ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

వికారాబాద్, న్యూస్‌టుడే: ముస్లిం మహిళల్లో భరోసా కల్పిస్తూ ముమ్మారు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చే విధానం చెల్లదని భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని వికారాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది గాజుల లవకుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడారు. సమాజాన్ని పీడిస్తున్న సమస్యల విషయంలో వితండవాదం చేయవద్దని, సంస్కరణాత్మక విధానాలను అనుసరించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జనార్దన్‌రెడ్డి, చౌదరి యాదవరెడ్డి, మాధవరెడ్డిలు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం రజతోత్సవాలు సెప్టెంబరు 10న

వికారాబాద్, న్యూస్‌టుడే: 1992లో ఏర్పాటైన న్యాయవాదుల సంఘం రజత (సిల్వర్ జుబ్లీ) ఉత్సవాల ముగింపు సమావేశం సెప్టెంబరు 10న హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో జరిగే ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామని, న్యాయవాదులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి యాదవరెడ్డి కోరారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో రజతోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను న్యాయవాదులతో కలిసి విడుదల చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదుల్లో దేశభక్తిని ప్రేరేపిస్తూ, సామాజిక స్పృహను కల్పించడంతో పాటు వృత్తి పరమైన నైపుణ్యాలను పెంపొందించి జాతి పునర్నిర్మాణంలో న్యాయవాదులను భాగస్వాములను చేయాలన్నదే తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు గాజుల లవకుమార్, మాధవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, యాదగిరి, మహవీర్ బందెయ్య, జగన్, రమేష్, రాము, యాసిన్, ఈశ్వర్‌రెడ్డి, జయలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	82–00	84–00
రిటైల్	97–00	99–00
డ్రెస్డ్	136–00	144–00
స్కిన్‌లెస్	160–00	168–00

వెన్‌కాబ్: 9849219870
సుగుణ: 9346589121

రూ.కోట్లు వసూలు.. అన్నదాత దిగాలు!

- ఆదుకోని పంట బీమా
- కనికరించని కంపెనీలు

న్యూస్‌టుడే, వికారాబాద్

వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే చాలా బీమా కంపెనీలు అన్నదాతల వాకిళ్ల ముందు రెక్కలు కట్టుకుని వాలిపోతుంటాయి. బీమా చెల్లిస్తే ఎంతో మేలంటూ ప్రచారం ఊదరగొడుతుంటాయి. చివరకు రైతులను ప్రసన్నం చేసుకొని బీమా ప్రీమియాన్ని ఎట్టకేలకు వసూలు చేస్తున్నారు. పంటలు దెబ్బ తింటే రూ.లక్షలు వస్తాయని చెప్పి తమ పని కానిస్తున్నాయి. తీరా బీమా చెల్లించాక, తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ కంపెనీలతో పాటు ప్రతి బ్యాంకు పంట రుణం తీసుకున్న రైతుల నుంచి బీమా సొమ్ము వసూలు చేస్తుంటాయి. ఇలా ప్రతి వానాకాలం, యాసంగి సీజన్లలో బీమా పేరుతో రైతుల నుంచి రూ.కోట్లు వసూలు చేస్తున్నారు. అయితే దీనివల్ల రైతులకు ప్రయోజనం కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా అన్నదాతల గురించి పట్టించుకునే వారే కరవయ్యారు.

వికారాబాద్ జిల్లాలో గత ఏడాది బీమాకు సంబంధించి ఇంత వరకు ఒక్క క్లెయిమ్ కూడా పరిష్కరించలేదు. ఈ ఏడాది పెద్ద ఎత్తున బీమా ప్రీమియం వసూలు చేశారు. రెండో సంవత్సరం బీమా చెల్లింపులు పూర్తి అయినా ఇంత వరకు గతేడాదికి సంబంధించిన వాటికి అతీగతీ లేదు. జిల్లాలో ఎంత మందికి బీమా మంజూరైందనే సమాచారం కూడా ఇంత వరకు రాలేదు. ఈ విషయమై వ్యవసాయ శాఖ వారిని రైతులు సంప్రదిస్తే క్లెయిమ్స్ జాబితా రాలేదని గతేడాది వానాకాలంలో వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి పంటను ఎంపిక చేశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సాధారణ బీమా (జనరల్ ఇన్సూరెన్స్) కంపెనీ రైతుల నుంచి బీమా ప్రీమియం వసూలు చేసింది. 6,348 మంది రైతుల నుంచి రూ.2.64 కోట్లు వసూలు చేశారు. 22 వేల ఎకరాల్లో పత్తి పంటకు రైతులు ఈ ప్రీమియం చెల్లించారు. తమ వాటాగా రైతులు ఎకరానికి రూ.1200 చొప్పున ప్రీమియం చెల్లించగా, మరో రూ.1200 ప్రభుత్వం భరిస్తుంది. 5శాతం చొప్పున రూ.2400 చెల్లించారు. జిల్లాలో 96 వేల మంది రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందారు. వీరిలో రుణాలు రెన్యూవల్ చేయించుకున్న 38,600 మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించారు.



నిరుడు వరదలతో నష్టపోయిన మొక్కజొన్న పంట

ఏఐసీ కంపెనీ ద్వారా..

వరి, పెసర, మినుము, కంది, మొక్కజొన్న తదితర పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వ్యవసాయ బీమా (అగ్రికల్చర్ ఇన్సూరెన్స్) కంపెనీ ద్వారా ప్రీమియం వసూలు చేశారు. మొత్తం 8,500 మంది రైతుల నుంచి రూ.1.69 కోట్లను వసూలు చేశారు. అన్ని పంటలకు కలిపి మొత్తం 34 వేల ఎకరాలకు ఈ ప్రీమియాన్ని చెల్లించారు.

- మిరపకి రైతు వాటా 5 శాతం చొప్పున రూ.1700 చొప్పున చెల్లించగా మిగతా రూ.1700 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాయి. అదే విధంగా వరికి ఎకరానికి రూ.540, పెసరకు రూ.260, కందికి రూ.280, మొక్కజొన్నకు రూ.500లు తమ వాటాగా రైతులు చెల్లించారు.
- వికారాబాద్ జిల్లాలో గత ఏడాది యాసంగిలో బ్యాంకు ద్వారా రుణాలు పొందిన 38,600 మంది రైతులు అన్ని పంటలకు కలిపి 2.42 కోట్ల బీమా ప్రీమియం చెల్లించారు. డీసీసీబీ బ్యాంకు వారే రూ.కోటి బీమా డబ్బులు చెల్లించారు. బ్యాంకు రుణాలు పొందని రైతులు 165 మంది వరికి రూ.89,100 బీమా ప్రీమియం చెల్లించారు. వీరిలో ఎవరికీ ఇంత వరకు నష్టపరిహారం వచ్చిన దాఖలాలు లేదు.

సన్నగిల్లుతున్న ఆసక్తి..

బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల నుంచి బీమాను తప్పని సరిగా వసూలు చేస్తున్నారు. రుణం తీసుకున్న వారికి, తీసుకోని వారికి, నేరుగా చెల్లించిన వారికి కూడా ఇంత వరకు బీమా అందలేదు. రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయటం తప్ప మంజూరు గురించి పట్టించుకోకపోవడంతో దీనిపై రైతులు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో తరచూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం, ప్రకృతివైపరీత్యాలు ఏర్పడటం వల్ల పంటలు దెబ్బతింటే తమకు ప్రయోజనం జరుగుతుందని కొంత మంది చెల్లిస్తుంటే అది కూడా రైతులకు ఉపయోగపడటం లేదు. ప్రతి ఏటా రైతులు ఇలాగే దగా పడుతూనే ఉన్నారు. బీమా మంజూరయ్యేది కొందరికే, అదీ కూడా సకాలంలో చెల్లించకుంటే ఇక రైతు బాగుపడేదెలా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పరిష్కరించడంలో నిర్లక్ష్యం..



వీరేశం, మైలార్‌దేవరంపల్లి, వికారాబాద్

2011 నుంచి ఇప్పటి వరకు వరి పంటకు బీమా చెల్లిస్తున్నాను. ఒక్క ఏడాది మాత్రమే మంజూరైంది. ఆరేళ్ల నుంచి ఇప్పటి వరకు పత్తి, మిరపకి బీమా ప్రీమియం చెల్లిస్తున్నాను. రెండేళ్లు మాత్రమే మంజూరైంది. 2016-17 సంవత్సరాలకు వానాకాలంలో సంబంధించి ఇంత వరకు పరిష్కరించలేదు. బీమా మంజూరైందీ లేనిదీ సంబంధిత కంపెనీ వారు సమాచారం ఇవ్వలేదు. సమీపంలోని వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించినా తమకు తెలియదని సమాధానం చెబుతున్నారు. రైతుల వద్ద నుంచి ప్రీమియం తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ, పరిష్కారంలో చూపించడం లేదు. ప్రభుత్వం కూడా బీమా ప్రచారంలో ఆర్భాటం చేస్తుంది. మంజూరు విషయంలో పట్టించుకోవడం లేదు. సంబంధిత బీమా కంపెనీలపై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

వీధి కుక్కల నియంత్రణకు 'ఏబీసీ'

- ప్రామాణికంగా మియాపూర్ 108వ వార్డు
- శ్రీకారం చుట్టనున్న బ్లూక్రాస్



అమల అక్కినేని

జూబ్లీహిల్స్: జీహెచ్ఎంసీతో కలిసి బ్లూక్రాస్ సంస్థ గ్రేటర్ హైదరాబాద్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మియాపూర్‌లోని 108వ వార్డులో ప్రయోగాత్మకంగా దీన్ని ప్రారంభించనుంది. బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఛైర్‌పర్సన్ అక్కినేని అమల, అధ్యక్షురాలు వాసంతి వాడి, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పశ్చిమ మండల పరిధిలోని వెటర్నరీ శాఖ అధికారులు అబ్దుల్ వకీల్, డాక్టర్ రంజిత్, ఛీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ గణేష్, యువ జంతు ప్రేమికురాలు అభినయలతో కలిసి బుధవారం జూబ్లీహిల్స్‌లోని బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మియాపూర్‌లోని 108వ వార్డును ప్రామాణికంగా తీసుకోగా... ఫిబ్రవరి నాటి లెక్కల ప్రకారం దాదాపు 3,300 వీధి కుక్కలను గుర్తించామని, వాటిలో 3 వేల కుక్కలకు ఈ ఏబీసీ/ఏఆర్‌వి చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిపారు. తాము ఏబీసీపై గతంలో దాదాపు 114 మంది వెటర్నరీ వైద్యులకు ఇక్కడ శిక్షణనిచ్చామని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఏబీసీ ద్వారా వీధి కుక్కల నియంత్రణ సాధ్యమవుతోందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అన్ని కుక్కలకు కు.ని. చికిత్స చేసే స్తోమత బ్లూక్రాస్‌కు లేదని, అందువల్ల ప్రభుత్వం ఒక ప్రణాళికతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నెక్లెస్ రోడ్డులో కుక్కలకు ప్రత్యేకంగా పార్కు త్వరలోనే ప్రారంభం కానుందన్నారు. ముఖ్య వెటర్నరీ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... బ్లూక్రాస్‌తో కలిసి ప్రస్తుతం మియాపూర్‌లో చేస్తున్న ఈ ఏబీసీ కార్యక్రమం అన్ని ప్రాంతాల్లో చేపట్టే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

పీఎం భార్గవ సేవలు అమూల్యం

నివాళి సభలో వక్తలు

బంజారాహిల్స్: శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగిన దివంగత ప్రముఖ శాస్త్రవేత్త, జీవకణ కేంద్ర పరిశోధన సంస్థ (సీసీఎంబీ) వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎం భార్గవ ఆశయాలను యువ శాస్త్రవేత్తలు కొనసాగించాలని శాంతా బయోటెక్ ఛైర్మన్ కేఐ వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత శాస్త్రవేత్త పీఎం భార్గవకు నివాళిగా, అప్నా వతన్, లామకాన్, మంథన్, సోల్ (సేవ్ అవర్ అర్బన్ లేక్స్) సంస్థల ఆధ్వర్యంలో సంస్మరణ సభను బంజారాహిల్స్‌లోని సాంస్కృతిక కళావేదిక లామకాన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... బయోటెక్నాలజీ రంగంలో పీఎం భార్గవ చేసిన కృషి అసామాన్యం అని ప్రశంసించారు. మంథన్ వ్యవస్థాపకుడు అజయ్‌గాంధీ, అప్నావతన్ ప్రతినిధి చందనా చక్రవర్తి మాట్లాడుతూ... శాస్త్రవేత్తగా పీఎం భార్గవ చేసిన కృషిని వివరించారు. సీసీఎంబీ ప్రస్తుత డైరెక్టర్ ఆచార్య రాకేష్ మిశ్రా, ఆ సంస్థ పూర్వ డైరెక్టర్ ఆచార్య మోహన్‌రావు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ వసంత్‌బాబా, మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారిణి డాక్టర్ డాఫ్నీ రెవెల్లో మాట్లాడుతూ... సీసీఎంబీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందంటే అందుకు ముఖ్యకారణం పీఎం భార్గవ అని కొనియాడారు. సినీ దర్శకుడు బి.నరసింగరావు, ప్రముఖ చిత్రకారుడు జగదీష్ మిత్తల్‌లు మాట్లాడుతూ... పీఎం భార్గవ శాస్త్రవేత్తగానే కాకుండా కళా రంగానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పాపారావు, వివిధ రంగాలకు చెందిన మెల్కోటే, కిన్నెర, సునీత, జస్వీన్ జైరాత్ పాల్గొన్నారు.

నీలోఫర్‌లో పొరుగుసేవల ఉద్యోగుల ధర్నా

రెడ్‌హిల్స్: గత రెండు నెలల వేతనాల బకాయిలు చెల్లించాలంటూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (టీఎంసీఈడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో నిలోఫర్ ఆసుపత్రిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల, శానిటేషన్, వార్డ్ బాయ్స్, డ్రైవర్లు విధులను బహిష్కరించి బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో ధర్నా చేశారు. నినాదాలతో హోరెత్తించారు. సంఘం నగర అధ్యక్షుడు ఎం. నర్సింహా మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నాయని సంబంధిత మంత్రి లక్ష్మారెడ్డి చెబుతున్నా ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల దగ్గర ఆ విశ్వాసాన్ని కోల్పోతోందన్నారు. నిలోఫర్ ఆసుపత్రిలో పొరుగు సేవల్లో సిస్టర్లు, టెక్నీషియన్లు, వార్డు బాయ్‌లు, డ్రైవర్లు కలిసి సుమారు 240 మంది ఉంటారన్నారు. రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. గాంధీ వంటి ఆసుపత్రుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.9500 వరకు వేతనాలు చెల్లిస్తుంటే. నిలోఫర్‌లో మాత్రం రూ.7500 వరకు మాత్రమే ఇస్తున్నారన్నారు.

లాట్ నంబర్ల కేటాయింపు సమయాన్ని పొడిగించాలి

తాండూరు: తాండూరు వ్యవసాయ విపణిలో నామ్ పద్ధతిన ఉత్పత్తులను విక్రయించేందుకు చేపట్టే లాట్ నంబర్ల కేటాయింపు ముగింపు సమయాన్ని మరో గంట వరకు పొడిగించాలని బుధవారం కమిషన్ ఏజంట్లు స్థానిక వ్యవసాయ విపణి సీనియర్ పర్యవేక్షకులు హబీబ్‌హల్వీని కోరారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మాత్రమే కేటాయింపు జరుగుతుంది. తర్వాత సమయాన్ని పొడిగించేందుకు నిబంధనలు అంగీకరించవని ఆయన ఏజంట్లకు వివరించారు. దీంతో ఓ కమిషన్ ఏజంటు తాను రైతులను కార్యాలయానికి పంపించానంటే గొడవలు జరుగుతాయి. అదికాక ముందే సమయాన్ని పొడిగించాలని సూచించారు. ఈవిషయంలో విస్మయానికిలోనైన పర్యవేక్షకులు సమయాన్ని పొడిగించేది లేదని సమాధానం ఇచ్చారు. అనంతరం ఈ విషయాన్ని ఛైర్మన్, విపణి కార్యదర్శికి వివరించారు. విపణి ఛైర్మన్ మాధవరెడ్డితో చరవాణిలో మాట్లాడారు. దీంతో విషయాన్ని విపణి పర్యవేక్షకులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఛైర్మన్ సమయాన్ని పొడిగించాలని సూచించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. అయితే గురువారం నుంచి మాత్రం ఎప్పటి మాదిరిగానే నిర్ణీత సమయమే అమలులో ఉంటుందని విపణి సిబ్బంది వెల్లడించారు.

పరిగి

నేడు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పరిగి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు అంతర్జాతీయ వైశ్య సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మలిపెద్ది మేఘమాల ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ నివాసం నుంచి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణానికి కృషి చేయాలని కోరారు.

తట్టు నివారణ టీకాల పంపిణీ

రాకంచర్ల(పూడూరు): మండల పరిధిలోని రాకంచర్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తట్టు నివారణలో భాగంగా పాఠశాల విద్యార్థులకు టీకాల పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా తెరాస నాయకులు జాజుల శ్రీనివాస్, జాహెద్‌లు మాట్లాడారు. చిన్నారులకు రోగ నిరోధక టీకాలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ శంకరాచారి ఉపాధ్యాయులు ఉన్నారు.

హలో ఈనాడు



పరిగి	:	8008573272
దోమ	:	8008573274
కుల్కచర్ల	:	8008573275
పూడూరు	:	8008573276
కుల్కచర్ల గ్రామీణ	:	7093981580

పరిగి, పూడూరు, న్యూస్‌టుడే:

సమస్య: ఎస్సీ కార్పొరేషన్ కింద రుణం మంజూరైంది. యూనిట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. రాయితీ నిధులు త్వరగా విడుదల చేయాలి.
– శ్రీనివాస్, కాళ్లాపూర్

● **సమాధానం:** కార్పొరేషన్ నుంచి ఇంకా అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ స్వీకరణ ముగింపు అనంతరం బ్యాంకర్లు నిర్ణీత తేదీని ప్రకటిస్తారు. దీంతో గ్రామ కార్యదర్శుల నుంచి సమాచారాన్ని సకాలంలో అందజేయడంతో పాటు ప్రతికల ద్వారా తెలియజేస్తాం **– కె.విజయప్ప, ఎంపీడీఓ**

సమస్య: పిల్లల పుట్టిన రోజు ధ్రువపత్రాలు అందక ఏడాది కాలంగా పడరాని పాట్లు పడుతున్నాం. కొన్ని సంస్థలు మాన్యువల్ పద్ధతిన జారీ చేసిన వాటిని అంగీకరించడం లేదు. ఆన్‌లైన్ పత్రాలనే అడుగుతున్నారు. అధికారులు త్వరగా అందించాలి.
– రాజశేఖర్, పరిగి

● **సమాధానం:** గ్రామ కార్యదర్శి పోస్టు ఇటీవలే భర్తీ అయింది. వారం రోజుల్లోగా డిజిటల్ కీ తీసుకుని అందించేందుకు కృషి చేస్తాం. **– జయరాం, ఈఓపీఆర్డీ**

సమస్య: భూమి పట్టాదారు పాసుపుస్తకం పోయింది. తిరిగి ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నా ఇవ్వటం లేదు.
– నరేశ్, పూడూరు.

● **సమాధానం:** ఇక నుంచి పోయిన పాసుపుస్తకాల నఖలు ఇవ్వటం కుదరదు. త్వరితగతిన నూతన విధానంలో పాసుపుస్తకాలు రానున్నాయి.
– కిషన్, తహసీల్దారు.

సమస్య: కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తు చేసుకుని ఆరు నెలలకు పైగా కావస్తుంది ఇంతవరకు అందటం లేదు.
– పోచయ్య, కడ్మూరు.

● **సమాధానం:** దరఖాస్తులో సరియైన వివరాలు పొందపర్చక పోవటంతో జాప్యం జరిగింది. పరిశీలించి మంజురు కోసం చర్యలు తీసుకుంటాం..
– కిషన్, తహసీల్దారు.

ఐనాపూర్ వాగుపై కల్వర్టు లేక ఇబ్బందులు



అసౌకర్యంగా మారిన వాగు ఇదే

నస్కల్(పరిగి): పరిగి మండలం నస్కల్ - ధారూర్ మండలం ఐనాపూర్ గ్రామాల మధ్య గల వాగుపై కల్వర్టును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. వర్షాలకు చిన్నపాటి వాగు వచ్చినా దాటలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా తాము కష్టాలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. వాగు పారితే ధారూర్, మోమిన్‌కలాన్, ఐనాపూర్ గ్రామాలకు వెళ్లడం కష్టంగా ఉందని కనీసం వ్యవసాయ పొలాలకు కూడా వెళ్లడం సమస్యగా మారిందని చెప్పారు. పంచాయతీరాజ్ అధికారులు చిన్నపాటి కల్వర్టును నిర్మించి రవాణా సదుపాయాలను మెరుగు పరచాలని కోరుతున్నారు.

వీధి దీపాల నిర్వహణ అధ్వానం



పగలే వెలుగుతున్న బల్బు

ఇబ్రహీంపూర్(పరిగి): గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ కోసం ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేకంగా ఒక వైరు ఏర్పాటు చేయాలని మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామస్థులు కోరుతున్నారు. రాత్రి సమయంలో దీపాలు ఆన్ చేస్తే 24 గంటల పాటు నిరంతరంగా వెలుగుతుంటాయని చెప్పారు. ఆన్ -ఆఫ్ సదుపాయం కోసం కండక్టర్ (వైరు) ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఏకధాటిగా కాంతులీనుతుండటంతో పంచాయతీకి దీపాల నిర్వహణకు తలకుమించిన భారంగా మారింది. దీంతో ఇతర అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని తెలిపారు. దీపాలు ఆన్ - ఆఫ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫోకస్

వెంటనే ప్రహరీ నిర్మించండి



ప్రహరీ లేక అడ్డంగా వేసిన ముళ్ల కంచె

చిట్యాల(పరిగి): మండలంలోని చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు, సిబ్బంది సమిష్టిగా కష్టపడి హరితహారంలో భాగంగా వెయ్యి మొక్కలు నాటినట్లు చెప్పారు. వాటిలో 990వరకు రక్షించారని అవన్నీ పెరిగి పెద్దగా మారాయని చెప్పారు. ఆసుపత్రి ఆవరణ రూపురేఖలు పూర్తిగా మారాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనే ప్రత్యేకంగా ఆసుపత్రికి గుర్తింపు వచ్చిందని అన్నారు. ఆసుపత్రి ముందు భాగంలో ప్రహరీ లేని కారణంగా ముళ్ల కంచెతో తాత్కాలిక రక్షణ కల్పించారని ప్రహరీ ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధికి ఆస్కారం కలుగుతుందని అన్నారు.

పశువైద్య భవనం మంజూరు చేయండి



శిథిలమైన భవనం ఇదే

నస్కల్ (పరిగి): శిథిలావస్థకు చేరిన పశువైద్య భవనాన్ని కూల్చివేసి కొత్తది ఏర్పాటు చేయాలని మండల పరిధిలోని నస్కల గ్రామస్థులు కోరుతున్నారు. భవనం పూర్తిగా పాడైందని పడిపోయే పరిస్థితిలో ఉందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మూగజీవాలను అక్కడకు తీసుకువెళ్లడం కూడా భయంగా ఉందని ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని ఆందోళన చెందుతున్నారు. పశు సంవర్ధక శాఖ కొత్త భవనాన్ని మంజూరు చేసి రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని కోరుతున్నారు.

భోజన బిల్లులను సకాలంలో చెల్లించండి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సంధ్య

కుల్కచర్ల, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే ఏజెన్సీలకు సకాలంలో బిల్లులను చెల్లించాల్సిన అవసరం ఉందని ఇప్పాయిపల్లి ఎంపీటీసీ సంధ్య పేర్కొన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వారా అందరికీ మేలు చేకూరుతుందని అన్నారు. సకాలంలోనే వంట బిల్లులను చెల్లించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

క్రీడా పోటీలు విజయవంతం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ వెంకటయ్య

దోమ, న్యూస్‌టుడే: దోమ మండలం దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం అండర్ 14/17 బాలబాలికల జోనల్ స్థాయి ఖోఖో క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విజయవంతంగా సాగాయి. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటయ్య, సర్పంచి రాంచెంద్రమ్మ, జడ్పీటీసీ సరోజ, మండల ఉపాధ్యక్షురాలు కవిత, గ్రంథాలయ జిల్లా డైరెక్టర్ యాదయ్యగౌడ్, నాగిరెడ్డి, ఎంపీటీసీ సత్యయ్య, పీడీ ఖాజా, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, పీఈటీలు గోపాల్, పాండురంగారెడ్డి, జయపాల్‌రెడ్డి, అన్నోజీరావు, తహసీల్దార్ హాజీఉన్నీసా, విద్యాధికారి హరిశ్చందర్, యువజన సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య సహకారం

ఈ సందర్భంగా స్థానిక యువజన సమాఖ్య (జై భీం, అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలాం, ఆదర్శ, సేవాలాల్ యువజన సంఘాలు అన్నదానం చేశారు. బహుమతుల పంపిణీ, టెంట్లు, మైదానం చదును చేసే పనులు చేపట్టారు) సభ్యులు వెన్నంటి ఉండి సహకారం అందించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారికి ఆహ్వానం పలుకుతూ వారికి తోడుగా సహాయం అందించారు. స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువజ సమాఖ్య సేవలను అభినందించారు.

రుణాలను సకాలంలో చెల్లించండి

కుల్కచర్ల గ్రామీణ: తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని ఐకేపీ గ్రామ సమన్వయకర్తలు శ్రీనివాస్, గణేష్ అన్నారు. బండవెల్కిచర్ల గ్రామంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల వసూళ్ళ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చాలా మంది డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకుని లబ్ధి పొందడం జరిగిందన్నారు. తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు తిరిగి చెల్లించడం ద్వారా మరలా రుణాలు పొందే వీలుంటుందని వారు పేర్కొన్నారు. చాలా మంది మహిళలు రుణాలను తిరిగి చెల్లిస్తున్నారన్నారు. రుణాలు తిరిగి చెల్లించకుంటే ఇతరులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉండదని తెలిపారు. సంఘంలోని సభ్యులు ఎవరైనా ఒకరు రుణాలు చెల్లించకుంటే ఆ సంఘంలో ఉన్న అందరు బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళిక ఆధారంగా బోధన



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ రాందాస్

కుల్కచర్ల: పాఠ్య ప్రణాలిక ఆధారంగా తరగతులకు విద్యాబోధన చేయడం ద్వార మంచి ఫలితాలు ఉంటాయని రిసోర్స్ పర్సన్ రాందాస్ పేర్కొన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని చౌడాపూర్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో హిందీ బోధన విధానం తదితర అంశాలపై చర్చ జరిగింది. కాంప్లెక్స్ అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హిందీ సబ్జెక్టుపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్షిక విద్యా ప్రణాలికలను కూడా తయారు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులకు ప్రభుత్వ లక్ష్యం మేరకు వారు బాగా రాణించేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ప్రతిభ గల వారిగా తయారు చేయవచ్చని సూచించారు. కాంప్లెక్స్ సమావేశంలో చర్చించిన ప్రతి అంశాన్ని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.

పరిగి

27న మన్నెగూడలో గౌడ సంఘం సమావేశం

పూడూరు: మండల గౌడ సంఘం సమావేశం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు సంఘం మండల నాయకులు సురేందర్‌గౌడ్, మానిక్యంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌గౌడ్ లు తెలిపారు. ఎన్కెపల్లి సమీపంలోని హిట్స్ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల ఎదురుగా ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

వినాయక చవితికి మండపాల ఏర్పాట్ల షురూ..!



ఆకర్షిస్తున్న మట్టి వినాయకుడు



పూడూరు: మాట్లాడుతున్న ఎస్సై అంజనేయిలు

దోమ, న్యూస్‌టుడే: ఈనెల 25న వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లోని యువకులు వాడవాడలా గణపతులను ప్రతిష్ఠించేందుకు మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు శాశ్వత మండపాలను రంగులతో అద్ది అందంగా ముస్తాబు చేస్తున్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటు, సంస్కృతిని చాటే కాషాయ జండాలు, దుస్తులతో కుట్టిన తోరణాలు కట్టేందుకు అనువైన విధంగా మండప ఆవరణను చక్కగా తీర్చిదిద్దుతున్నారు. పిచ్చిమొక్కల్ని తీసేస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను ఊడ్చి శుభ్రం చేసే పనుల్లో తీరికలేకుండా నిమగ్నమయ్యారు.

మండపాలకు అనుమతులు తీసుకోవాలి

పూడూరు: వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై అంజనేయిలు తెలిపారు. మండల పరిధిలోని మన్నెగూడలో బుధవారం ఆయా గ్రామాలకు చెందిన శాంతి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీధుల్లో వినాయక విగ్రహాల ఏర్పాటు నేపథ్యంలో ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరు సహకరిస్తేనే ఉత్సవాల ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై యాదయ్య సిబ్బంది రాఘవేందర్ సర్పంచులు నవీన్‌కుమార్, శంకరాచారి నాయకులు లింగప్ప, అశోక్, కృష్ణ ఉన్నారు.

గంగ(తల్లి)తో- గణపతి గమనం

గణపతి గమనం-గంగ(తనతల్లి)తో ఆరంభం
తనతల్లి ఒడిలో-విజ్ఞానపు జడిలో
పరవళ్లు తొక్కుతూ రావయ్యా..
మము పరవశింపచేయవయ్యా
ఆరంభించు-ప్రారంభ ప్రార్థనలు
మనమంచి గణపతికి- అభిమాన మాలలు
బంగారు, రాగి, మట్టి ప్రతిమలు
సకల శుభ సంకల్ప తోరణాలు
త్రిలోక పూజ్యుడై-ఇష్టదైవ ప్రదాయకుడై
యేతెంచె సకల శుభసంకల్ప ప్రదాయకుడై
ఆరంభించు-ప్రారంభ ప్రార్థనలు

(ఎ ప్రకాష్‌కుమార్, ఉపాధ్యాయుడు, ఉన్నత పాఠశాల దోమ)

– న్యూస్‌టుడే, దోమ

చలపతి కుటుంబాన్ని ఆదుకోవాలి

పరిగి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వెంకటాచలపతికి చెందిన భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో అధికారుల వేధింపులు మితిమీరాయని దాంతో ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పరిగి నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ఒక ప్రకటనలో ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని పలు మార్లు ఉన్నతాధికారులను కోరినా పట్టించుకోలేదని పేర్కొంది. ఈవిషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని నిరుపేదలకు అండగా నిలవాలని కోరింది. మృతుని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేసింది.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పూడూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏఎస్సై యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం మన్నెగూడ కూడలిలో ఈనెల 20న రాత్రి బస్టాండు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరు తీవ్రగాయాలకు గురయినట్లు చెప్పారు. స్థానికుల సమాచారంలో గాయపడిన వ్యక్తిని వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు చెప్పారు. మృతుడు ఎవరనేది ఇంకా గుర్తించ లేదని ఒంటిపై జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని వెల్లడించారు. శవాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామని చెప్పారు.

టీకాలు తప్పకుండా వేయించండి



టీకాలు వేస్తున్న ఏఎన్ఎం

దోమ, న్యూస్‌టుడే: పిల్లలకు తట్టు టీకాలు తప్పక ఇప్పించాలని వైద్యాధికారి డా కృష్ణ, సర్పంచి వెంకటమ్మ అన్నారు. మంగళవారం దోమ మండలం రాకొండ ప్రాథమి పాఠశాలలో విద్యార్థులకు రుబెల్ల(తట్టు) టీకాలు విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తట్టుతోపాటు రోగనిరోధక శక్తిని కలిగేందుకు టీకా ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఇతర వ్యాధులు దరిచేకుండా ఉండేందుకు ఈ టీకా ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఇతర వ్యాధులతో బాధ పడతున్న కూడా తట్టు టీకా ఇప్పిస్తే ఎలాంటి సమస్య ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, స్కూల్ ఛైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందే!

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఉద్యోగులకు గుదిబండగా మారిన సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి చంద్రకాంత్ పేర్కొన్నారు. సీపీఎస్ విధానం రద్దు కోరుతూ సెప్టెంబర్1న సామూహిక సెలవుకు సంబంధించి గోడపత్రికను మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుల్కచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏళ్ల తరబడి ఈ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. సామూహిక సెలవును పెట్టడం ద్వారా ప్రభుత్వంపై తీవ్రస్థాయి ఒత్తిడిని తీసుకువస్తామని అన్నారు. వివిధ దశల్లో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన ప్రణాళికను తయారు చేస్తున్నామని అన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు పూర్తి స్థాయిలో ఈ విధానం రద్దును కోరుతూ సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరమని తెలిపారు. రాజీలేని పోరాటాన్ని చేస్తామని ప్రభుత్వం దిగిరావలసిందేనని చంద్రకాంత్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న చంద్రకాంత్ తదితరులు

చదవడం, రాయడం నేర్పించాలి



మాట్లాడుతున్న విద్యాధికారి

దోమ, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్పించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. బుధవారం దోమ మండలం బొంపల్లి ఉన్నత పాఠశాలలో త్రీఆర్స్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో గట్టి పునాది వేస్తేనే ఉన్నత స్థాయిలో బోధించే అంశాలు చక్కగా నేర్చుకుంటారని అన్నారు. ఏ స్థాయిలో ఏ అంశాలు బోధించాలో వాటిని నేర్పితేనే మంచిదని అన్నారు. గతంలో ప్రాథమిక స్థాయిలో గట్టి పునాది లేకనే నేడు తీఆర్స్‌పై ప్రభుత్వం ప్రారంభం నుంచి అక్షరాలు నేర్పిస్తోందన్నారు. దీంతో విద్యార్థిస్థాయికి సరైన న్యాయం చేయలేకపోతారన్నారు. చురుగ్గా ఉండే విద్యార్థులకు అంతరాయం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు హరిలాల్ సీఆర్‌పీలు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం నిర్మించి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోలేదన్నారు. మండల కేంద్రంలో 6అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారన్నారు. ఈ కేంద్రాలను పురాతన భవనాల్లో నిర్వహించడంతో పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నామన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నేడు కబడ్డీ పోటీలు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో జోనల్ స్థాయి అండర్ -14, 17 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలకు కొడంగల్, బొంరాస్‌పేట మండలాల విద్యార్థులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

మొక్కల పెంపకంతోనే కరవు నివారణ



మొక్కను నాటుతున్న విజయమాల, వార్డు సభ్యులు

పరిగి, న్యూస్‌టుడే: విరివిగా మొక్కలు నాటితనే కరవును జయిస్తామని పట్టణ సర్పంచి విజయమాల అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో వార్డు సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. అటవీ సంపద దెబ్బతినడంతోనే కరవు కాటకాలు నెలకొంటున్నాయని చెప్పారు. ప్రతి పంచాయతీకి ప్రభుత్వం 40వేల చొప్పున మొక్కలు నాటాలని పేర్కొందని ఇందుకు వార్డు సభ్యులు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు నాటిన మొక్కలు ఎండిపోకుండా సంరక్షణ బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ఎదిరె పద్మ, ఎంపీటీసీ సభ్యుడు సమద్, వార్డు సభ్యులు సర్వర్, అక్బర్, లక్ష్మి, ఉమారాణి, మౌలానా, శుక్రాబేగం, సాదక్, సురేందర్, యూసుఫ్ పాల్గొన్నారు.

పరిగి, న్యూస్‌టుడే: చిగురాల్‌పల్లి: పండ్ల మొక్కలతో విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మండలంలోని చిగురాల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల పాఠశాల యాజమాన్య కమిటి ఛైర్మన్ సుభాన్, ఉపాధ్యాయులు ఎ.క్రిష్ణ, ఎన్.నర్సిములు, ఆర్.శ్రీనివాస్, జి.లక్ష్మయ్య, జి.క్రిష్ణ అన్నారు. హరితహారంలో భాగంగా బుధవారం 120 మంది విద్యార్థులకు జామ, దానిమ్మ, అల్లనేరేడు, మొక్కలు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు తమ ఇంటి ఆవరణ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని తద్వారా ఫలాలను పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శ్రమించే తత్వం అలవడాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత సంక్షేమమే ప్రధాని లక్ష్యం

కాటేదాన్: దేశంలోని యువత సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యమని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధరరావు అన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని మహావీర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బీజేవైఎం నిర్వహించిన ఖోఖో, కబడ్డీ పోటీల్లో రాణించిన విజేతలకు ఆయన షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ విధమైన లోటుపాట్లను యువకులు జీవితంలో ఎదుర్కొనకుండా ఉంటే దేశరక్షణకు, అభివృద్ధికి వారే నాంది పలుకుతారన్నారు. అన్ని రంగాల్లో యువత ముందుండాలని రాష్ట్ర భాజపా అధ్యక్షులు డా. కె.లక్ష్మణ్ అన్నారు. తొలుత పోటీలను ప్రారంభించి నల్గొండ, హైదరాబాద్, వనపర్తి, నిజామాబాద్‌లనుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

పల్లెకు చేరుతున్న.. పండగ చీరలు!

దసరాకు ముందే బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు ● జిల్లాలో 2.99 లక్షల మంది ఆడపడుచులకు లబ్ధి



బతుకమ్మ చీరలు పంపిణీకి సిద్ధం..



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (దాచిన చిత్రం)

న్యూస్‌టుడే, వికారాబాద్



బతుకమ్మ చీరలు

'బతుకమ్మ' పండగ తెలంగాణ జానపద సంస్కృతికి ప్రతీకగా నిలిచింది. కాకతీయుల కాలంలో కాకతమ్మ ఉత్సవాలు బతుకమ్మ పండగగా మారి తెలంగాణలో బహుళ ప్రచారం పొందాయి. తెలంగాణ ప్రాంతంలో ఆడపడుచులు అత్యంత వైభవంగా.. ఆనందోత్సాహాల మధ్య నిర్వహించే పండగ బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు జరిగే సంబురాల్లో చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకు ఉత్సాహంగా పాల్గొంటారు. ప్రకృతి ప్రసాదించే రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిభింబించే విధంగా పాటలు పాడుతూ, ఆటలు ఆడతారు. ఇలాంటి సందర్భంలో 18 ఏళ్లు పైబడి, తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలందరికీ బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు జిల్లాలో ఎంత మంది అర్హులు ఉన్నారో లెక్క తేల్చాలని పౌరసరఫరాలశాఖను ఆదేశించింది. వీరిచ్చిన వివరాల ఆధారంగా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని జిల్లా పాలనాధికారికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో అర్హత కలిగిన మహిళల వివరాల సేకరణ, చీరల పంపిణీ చేయడం వంటి ప్రణాళికలను రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. బతుకమ్మ పండగకు వారం రోజుల ముందే చీరలు పంపిణీ చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని 2.99 లక్షల మంది ఆడపడుచులకు చీరలు అందజేయాలని అధికారులు తాజాగా లెక్కలు తేల్చారు.

పేద కుటుంబాలకు ఆసరా..

బతుకమ్మ పండగ సందర్భంగా చీరలు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలోని పేద కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఆహారభద్రత కార్డులు కలిగి, 18 ఏళ్ల వయస్సు పైబడిన ఆడపడుచులకు చీరలు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. పౌర సరఫరాలశాఖ వారు తమ దగ్గర ఉన్న వివరాల నుంచి లబ్ధిదారుల జాబితా లెక్క తేల్చారు. జిల్లాలో 2.07 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులు, 27,156 అంత్యోదయ కార్డులు జారీ చేశారు. వీరందరికీ 593 ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నారు. ఇదే ప్రాతిపదికన బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు గ్రామానికో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి చీరలు పంపిణీ చేయనున్నారు.

జాబితాలు సిద్ధం..

బతుకమ్మ చీరల పంపిణీకి గ్రామాలు, మండలాల వారీగా జాబితాను రూపొందించారు. 18 ఏళ్లు ఆపై వయస్సు కలిగిన వారు జిల్లాలో 2.99 లక్షల మంది ఆడపడుచులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ జాబితా రూపొందించి, ఈ వివరాలను గ్రామీణాభివృద్ధిశాఖ వారికి అందించారు. వీరు జిల్లాలో ఉన్న 593 రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల మహిళలకు చీరలు పంపిణీ చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. త్రిసభ్య కమిటీలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, రేషన్ డీలర్‌లు సభ్యులుగా ఉంటారు. జిల్లాకు సరఫరా అయ్యే చీరలను వికారాబాద్, పరిగి, కొడంగల్‌లలోని వ్యవసాయ విపణి గోదాంలలో నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబరు 20 నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఆరంభ రోజు నుంచే చీరల పంపిణీకి శ్రీకారం చుట్టేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిపై ఈ నెల 24న అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలతో పాటు చీరల పంపిణీకి అనుసరించాల్సిన మార్గదర్శక సూత్రాలను తెలియజేయనున్నారు.

చీరల పంపిణీ ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తాం..

– జాన్సన్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి



బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తాం. వరస క్రమంలో వచ్చిన వారికి చీరలను పంపిణీ చేస్తాం. జిల్లాలో ఉన్న 593 రేషన్ దుకాణాల ద్వారా వీటిని పంపిణీ చేయాలని భావిస్తున్నాం. రేషన్ దుకాణాలైతే చిరునామా విషయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఎక్కడి దుకాణం పరిధిలోని వారు అక్కడే తీసుకోవచ్చు. జాబితాలో చివరి వరసలో పేర్లు ఉన్నవారు తమకు చీరలు అందుతాయా లేదా అనే అనుమానాలను పెట్టుకోవద్దు. అర్హులందరికీ సక్రమంగా చీరలు అందేలా త్రిసభ్య కమిటీ చూసుకుంటుంది.



కొర్ర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

ధారూర్: చిరు ధాన్యాలు పండించటం వలన భూసారం పెరుగుతుందని వాటిని తీసుకోవడం వలన ఆరోగ్యం చేకూరు తుందని భారతీయ చిరు ధాన్యాల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు ఎస్.ఎస్.సుబ్బారావు అన్నారు. గోధుమగూడ భారతీయ చిరు ధాన్యాల పరిశోధనాశాల సౌజన్యంతో 'గ్రామీన్ మాల్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో రైతులు పండిస్తున్న చిరు ధాన్యాల పంటల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి రైతు సదస్సుల్లో ఆధునిక చిరు ధాన్యాల సాగు పద్ధతులను రైతులకు వివరించారు. సజ్జలు, సామలు, కొర్ర పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల పంటలు సాగు చేయటం వలన భూమి సారవంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశిధర్‌రెడ్డి, ముకేశ్, సుబ్బారాయుడు, దీపిక, సుగన్న, స్వర్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలం: భాజపా

బాలాపూర్: రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువ శాతం మంది రైతులు కూరగాయలను పండిస్తారని.. వారికి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు ఎ.రాంరెడ్డి ఆరోపించారు. తుక్కుగూడలో ఈనెల 28న కూరగాయల రైతుల సమస్యలపై జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే 'రైతు పంచాయతీ' కార్యక్రమ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. బడంగ్‌పేట కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ఎన్.లింగంయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ సకాలంలో నాణ్యమైన విత్తనాల సరఫరా, పనిముట్లపై సబ్సిడీ, కూరగాయల మార్కెట్లో సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు పంచాయతీ కార్యక్రమానికి భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు హాజరవుతున్నారన్నారు. రైతులు, భాజపా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.